క్లుప్తంగా

పోస్టల్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ముదిగొండ: పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్‌శాఖ ఖమ్మం సౌత్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ బాజీ వేము అన్నారు. డీసీడీపీ కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలోని వల్లభిలో పోస్టాఫీస్ ఖాతాలు, బీమా పథకాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో సర్పంచ్ పోట్ల కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి ఇంతియాజ్, మెయిల్ ఓవర్‌సీస్ పెరుగు నాగేశ్వరరావు, లక్ష్మణ్, బీపీఎం జరీనా, ఏబీఎం సుధాకర్, సాయి పాల్గొన్నారు.

కల్లూరు తహసీల్దార్‌గా సాంబశివుడు



కల్లూరు రూరల్: కల్లూరు తహసీల్దార్‌గా పులి సాంబశివుడు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సాంబశివుడుని సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జీతాలు ఇప్పించండి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సత్తుపల్లి: ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వటం లేదని బయట అప్పులు కూడా పుట్టే పరిస్థితి లేదని సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న 21 మందికి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లుకు మంగళవారం విన్నవించుకున్నారు. వేతనాలు ఇప్పించమని ఇప్పటికే పలుమార్లు కలెక్టర్ నుంచి ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని, పండుగలు కూడా చేసుకోలేకపోతున్నామని వాపోయారు. దీనిపై సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడామని, రెండు, మూడురోజుల్లో సగం జీతమైన వచ్చేలా ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కుమారి, రాణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీరు విడుదల

చింతకాని: చింతకాని, బోనకల్ మేజర్ కాల్వలకు ఈ నెల 14, 15వ తేదీల్లో రెండు రోజుల పాటు సాగర్ నీటిని విడుదల చేయనున్నట్లు ఎన్నెస్పీ జేఈ సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సాగుచేసిన వరి, ఇతర ఆరుతడి పంటలకు సాగర్ నీటిని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి

ఎర్రుపాలెం: నాగార్జునసాగర్ జలాలను కట్లేరుతో పాటు చెరువులను నింపాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఖమ్మం ఆర్డీవో గణేష్, తహసీల్దార్ ఉషాశారదలకు వినతిపత్రాలను అందచేశారు. సాగునీరు లేకపోవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా జలాలు విడుదల చేయాలని కోరారు. నాయకులు బండారు నర్సింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, కోటపాటి రంగారావు, శీలం వెంకట్రామిరెడ్డి, మల్లెల లక్ష్మణరావు, షేక్ జానీబాషా, అనుమోలు కృష్ణారావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ, దేవరకొండ శ్రీను, తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

చింతకాని: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సోమా నాగేశ్వరరావు ఈనెల 6న ఇంటి నుంచి బయటకువెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకి లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమారుడు ఉదయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సత్తుపల్లిటౌన్: ప్రపంచ మానసిక వైద్య దినోత్సవం సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి ఆదేశల మేరకు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ రోగులను పరీక్షించి మందులు అందించారు. న్యాయవాదులు వెంకట్రావు, సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట గొంతెండుతోంది..!

- కాపాడుకునేందుకు అన్నదాతల పాట్లు
- చేతికందిన పంట ఎండిపోతోందని ఆందోళన
- వ్యయ ప్రయాసలకోర్చి బోర్లు వేస్తున్న వైనం
- ఒక్కో బోరుకు రూ.2.70 లక్షలకు పైగా వ్యయం



ఎండిపోయిన వరిపంట



ఎండిపోయిన చెరువు



బోరు వేయిస్తున్న రైతు

కల్లూరు రూరల్: ప్రతీ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో ఎంతో ఉత్సాహంగా పంటల సాగు చేసుకునే రైతులకు ఈ సీజన్ తీవ్రనిరాశను మిగిల్చింది. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి, వేసిన పంటలు నీరు లేక ఎండిపోతుండటంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండే రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఏటా జూన్, జులై నెలల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుంది. కానీ ఈ సీజన్‌లో జులై, ఆగస్టు వరకు కూడా సాధారణ వర్షపాతం కంటే తక్కువగా వర్షాలు పడ్డాయి. ఆగష్టు మొదటి వారంలో పడిన వర్షాల వల్ల చెరువుల్లో గరిష్టస్థాయిలో నీరు చేరటం వల్ల చెరువుల ఆయకట్టు కింద వరినాట్లు వేశారు. అయితే, వర్షాలు లేక నాగార్జునసాగర్ డ్యామ్‌లో నీరు చేరలేదు. దీంతో సాగుకు సాగర్ నీరు విడుదల చేయలేని దుస్థితి ఏర్పడింది.

వరిసాగులో జిల్లాలో టాప్..

వరిసాగులో ఖమ్మం జిల్లాలోనే కల్లూరు మండలం మొదటి స్థానంలో ఉంటుంది. మొత్తం 36 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. సాగర్ ఆయకట్టు కింద 26 వేల ఎకరాలు, చెరువులు, కుంటల కింద 6వేల ఎకరాలు, లిఫ్టల కింద మరో 4వేల ఎకరాలు ఆయకట్టు సాగవుతుంది.

ఎండిపోయిన రిజర్వాయర్లు..

సాగునీరు సరఫరా చేసే రిజర్వాయర్లు వర్షాభావ పరిస్థితి వల్ల ఎండిపోయే దశకు చేరాయి. దీంతో సాగునీరు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. కృష్ణా బేసిన్‌లో వర్షాలు లేక నాగార్జునసాగర్లో నీటినిల్వలు అడుగంటాయి. వాతావరణంలో తేమలేక పోవటం, పొడి వాతావరణం వల్ల వేసిన పంటలు ఎండిపోతున్నాయి. పంటలు కాపాడేందుకు గాను స్థానిక ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృషి ఫలితంగా గత నెలలో పాలేరు జలాశయం నుండి వారం పాటు నీరు విడుదల చేశారు.

వ్యయప్రయాసలకోర్చి బోర్లు...

ఈ ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు వరి, మిర్చి, పత్తి వర్షాభావ పరిస్థితితో ఎండిపోకుండా కాపాడేందుకు రైతులు ఎంతో ప్రయాసాలతో బోర్లు వేస్తున్నారు. గత నెలలో మండలంలో 80బోర్లు వేశారు. ఒక్కో బోరుకు సుమారు 2.70 లక్షల వ్యయం అవుతుంది. బోరుకు 1.60లక్షలు, డ్రిల్లింగ్ పైపులకు రూ.60వేలు, మోటార్లు, విద్యుత్ సౌకర్యం, పోల్స్ ఏర్పాటుకు మరో 50 వేలు వ్యయం అవుతుంది.

బోర్లు వేయిస్తున్నాం



ఆరుతడి పంటలు కాపాడుకునేందుకు ఎంతో ఖర్చు చేసి బోర్లు వేయిస్తున్నాము. ఖర్చుతో కూడుకున్న పని అయినప్పటికీ సాగునీరు అందక పోవటం వల్ల వేరే మార్గం లేకపోవటంతో బోర్లు వేయించాల్సి వస్తుంది. ఒక్కోక్క బోరుకు రూ.2.70లక్షల ఖర్చు అవుతుంది.

– వెంకటరామరాజు, రైతు, మర్లపాడు

ఏ ఏడాది కష్టకాలమే



ఈ సంవత్సరం ఖరీఫ్‌లో జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు సరిగ్గా కురవలేదు. చెరువుల్లో అంతంత మాత్రంగానే నీరు చేరాయి. సాగర్ కాలువ కింద నీరు వస్తుందని ఆశతో వరినాట్లు వేశాం. ప్రాజెక్టులో నీరు లేక సాగునీరు వచ్చే పరిస్థితి లేదు. కనీస పెట్టుబడి కూడా వచ్చేలా లేదు.

– కర్నాటి పిచ్చిరెడ్డి, కప్పలబంధం

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి



మధిర: పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్ రాజు



కొణిజర్ల: పార్టీలో చేరిన వారితో మదన్‌లాల్



కల్లూరు రూరల్: పార్టీలో చేరిన కుటుంబాలు

మధిర: బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. మధిర బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం అంబారుపేట గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాల వారు కాంగ్రెస్, టీడీపీ నుంచి గులాబీ పార్టీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు కనుమూరి వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని చిరునోముల, చొప్పకట్లపాలెం,ముష్టికుంట్ల గ్రామాలలో కాంగ్రెస్ నుండి 120 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ కండువలా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బందం శ్రీను, షేక్ ఉస్సేన్, దొప్ప శ్రీను, సురేష్, చేబ్రోలు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: మండల కేంద్రంలో పలు పార్టీలకు చెందిన కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్ లాల్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మదన్ లాల్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్యకర్తలు ఆదరించి వైరా నియోజకవర్గం నుంచి తనను గెలిపిస్తే రుణం తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోడపోతుల వెంకటేశ్వర్లు(బాబు), వై.చిరంజీవి, పి శ్రీనివాసరావు, పాముల వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, మల్లేష్ యాదవ్, డి.రామారావు, జీడయ్య, విజయ్, మౌలానా, రమేష్, వెంకటేశ్వర్లు, రత్నం, నరసింహారావు, మీటు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు రూరల్: మండలంలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరాయి. వీరికి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. అరిగెల బాబు, మోదుగు సుదర్శన్, నాగమ్మ, రావూరి నవీన్‌రావు, రమేష్ తదితరులు పార్టీలో చేరారు. సర్పంచ్ సుబ్బారావు, ఎంపీటీసీ మేరమ్మ, పోచవరం సొసైటీ చైర్మన్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



సత్తుపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక్ చక్రవర్తి



బోనకల్: మాట్లాడుతున్న తహసీల్దార్

సత్తుపల్లి: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు అధికార యంత్రాంగానికి సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి, ఏసీపీ రామానుజం కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికల్లో ఘర్షణలకు తావులేకుండా వ్యవహరించాలని, సమావేశాలు, ర్యాలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎవరు ముందు చేసుకుంటే వారికే అవకాశం ఉంటుందన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అలజడులు, ఘర్షణలు జరగకుండా సమన్వయం పాటించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ యోగేశ్వర్‌రావు, సీఐ మోహన్‌బాబు, ఎస్సైలు, అధికారులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

బోనకల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పున్నం చందర్ మాట్లాడుతూ... గ్రామాలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు. ర్యాలీలు, సభలు నిర్వహించుకునేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్, ఎస్సై సాయికుమార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాటక రచన ప్రత్యేకమైంది



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: తెలుగు సాహిత్యంలోని అనేక ప్రక్రియల్లో నాటకం అత్యున్నతమైందని సింగరేణి పీఓ ఎస్.వెంకటాచారి అన్నారు. మంగళవారం ప్రముఖ కవి, నాటక రచయిత, నంది అవార్డు గ్రహీత హెచ్‌వీఎల్ ప్రసాదబాబు రచించిన జమలాపుర క్షేత్ర మహాత్మ్యం నాటక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రసాదుబాబు జమలాపురం క్షేత్ర విశిష్టతను కళ్లకు కట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత మధుసూదనరాజు, డాక్టర్ హర్షిత్, సృజన్ బాధ్యులు రామకృష్ణ, పసుపులేటి నాగేశ్వరరావు, గండ్ర కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల నిరసన



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలలో భాగంగా మంగళవారం సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలలో సింగరేణి కార్మికులు నిరసన తెలిపి మేనేజర్లకు వినతిపత్రం అందజేశారు. జేవీఆర్‌ఓసీ ఫిట్ కార్యదర్శి నర్సింహారావు, భద్ర, కిష్టారం ఓసీ బ్రాంచ్ జాయింట్ కార్యదర్శి భరణి, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి అజ్మద్ అలి, శ్రీనివాస్, మోతే సాంబశివరావు, వివి రమణ, అఫ్రోజ్ పాల్గొన్నారు.

నూరుశాతం వ్యాక్సినేషన్ లక్ష్యం



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న రామారావు

కారేపల్లి: నూరుశాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని జిల్లా వ్యాక్సినేషన్ మేనేజర్ సీహెచ్.రామారావు అన్నారు. మిషన్ ఇంద్రధనుస్సులో భాగంగా గ్రామగ్రామాన చేపట్టుతున్న వ్యాక్సినేషన్ ప్రక్రియను మంగళవారం మండలంలోని బొక్కలతండా, గిద్దెవారిగూడెం గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో చేపట్టిన వ్యాక్సినేషన్ ప్రక్రియ వివరాలను ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది తమకు కేటాయించిన యాప్‌లో ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సురేష్, వైద్యురాలు హిమబిందు, సీహెచ్‌ఓ భద్రయ్య, పీహెచ్‌ఎన్ కమలాగ్రేస్, ఏఎన్ఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంఈఓ జయరాజు

కారేపల్లి: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, వారిలో సృజనాత్మకతను వెలికితీసే విధంగా విద్యా బోధన చేయాలని ఎంఈఓ జయరాజు అన్నారు. మంగళవారం కారేపల్లి హైస్కూల్‌లో మండలంలోని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ యాప్‌లో విద్యార్థుల రిజిస్ట్రేషన్, గ్రూప్ అటెండెన్స్ ఏ విధంగా నమోదు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రేమగా ఉండాలి



కేంద్రాన్ని సందర్శించిన న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి

మధిరరూరల్: మానసిక దివ్యాంగులపై ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.కార్తీక్ రెడ్డి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాల ఆవరణలో ఉన్న భవిత అవసరాల వనరుల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పిల్లల అవసరాలను గుర్తించి, వారిని క్రమశిక్షణతో తీర్చిదిద్ది, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మురళీకృష్ణతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది సూర్యనారాయణ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

పెనుబల్లి: మండలంలోని పాతకారాయిగూడెంలో తండాలో వీఎం బంజర్ పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బానోతు రాములు నుంచి నాలుగు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెనుబల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మంగళవారం సత్తుపల్లి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అదే మార్గంలో వస్తున్న మరో ద్విచక్రవాహనం మండలంలోని రాంచందర్‌రావు బంజర్ వద్ద ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా, ప్రమాదానికి కారకుడైన వాహనదారుడు పరారయ్యాడు.

ఆటోను వదిలివెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని అంబారుపేట గ్రామంలో 3వ వార్డుకు చెందిన శీలం తిరుమలరావు పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు ఏపీ 39 యూఏ 2805 నంబర్‌గల ఆటోను వదిలివెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు. సుమారు ఆరు రోజులుగా ఆటో అక్కడే ఉందని, సంబంధిత వ్యక్తులు ఎవ్వరూ రాలేదని స్థానికులు చెబుతున్నారు.

పరామర్శ

కల్లూరు రూరల్: మండలంలోని లక్ష్మీపురం(రాళ్లబంజరు)కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వేము యోహాన్‌రాజు మంగళవారం మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఫోన్‌లో పరామర్శించారు. ఈ మేరకు మండల ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నివాళులర్పించారు.

ఆరు గ్యారంటీలపై ప్రచారం



సత్తుపల్లిరూరల్: పథకాలను ప్రజలకు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కల్లూరు రూరల్: లక్ష్మీపురంలో..

సత్తుపల్లిరూరల్: ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శివవేణు, కొత్రపాటి సాల్మన్‌రాజు అధ్యక్షతన సదాశివునిపేట, సిద్దారం, గౌరిగూడెం, రేజర్ల, జవహర్‌నగర్‌లలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రకటించిన ఆరు హామీల గ్యారంటీ కార్డులను ప్రతీ ఇంటికి అందచేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అభయ హస్తం ఆరు హామీల గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోళ్ల అప్పారావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హలావత్ వెంకటేశ్వర్లు, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొంతు సరోజ, ఎండి.మున్వర్ హుస్సేన్, జొన్నలగడ్డ శ్రీను, సర్పంచ్ జక్కుల ప్రభాకర్, గుంటూరు శివశంకర్, దుబ్బాక చందు, మందపాటి ప్రసాద్, మాజీ కౌన్సిలర్ దేవళ్ల పెద్దిరాజు, రాయల కోటేశ్వరరావు, హరిప్రసాద్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఫాయాజ్, సత్యనారాయణ, మోరంపూడి సత్యం, పీరా అబ్బులు, బాలసాని చెన్నారావు పాల్గొన్నారు.

కల్లూరు రూరల్: మండలంలోని లక్ష్మీపురం(రాళ్లబంజరు)లో కాంగ్రెస్ నాయకులు జిల్లెళ్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. చుక్కాగాలం వీరేంద్ర, రవికుమార్, సైదులు, కృష్ణ, బాల్య, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



ఎర్రుపాలెం: రాజుపాలెంలో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ గణేష్, ఏసీపీ రవి



వేంసూరు: బోర్డర్ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ, ఏసీపీ



చింతకాని: తనిఖీ చేస్తున్న ఏసీపీ రహమాన్

ఎర్రుపాలెం: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఖమ్మం ఆర్డీఓ గణేష్, సీసీఎస్ ఏసీపీ రవి హెచ్చరించారు. మంగళవారం రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన మండలంలోని రాజుపాలెం, ఎర్రుపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధిర సీఐ వసంత్‌కుమార్, ఉషాశారద, ఎస్సై ఎం.సురేష్‌తో మాట్లాడారు. తనిఖీలు ముమ్మరంగా నిర్వహించాలని సూచనలు చేశారు.

క్షుణ్ణంగా తనిఖీ చేయాలి..

సత్తుపల్లిరూరల్: అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను కల్లూరు ఆర్డీఓ చక్రవర్తి, ఏసీపీ రామానుజం సత్తుపల్లి మండలం మేడిశెట్టివారిపాలెం చెక్‌పోస్టులను తనిఖీ చేపట్టారు. సిబ్బంది పనితీరును పరిశీలించి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. సీఐ మోహన్‌బాబు, తహసీల్దార్ యోగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంసూరు: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కల్లూరు ఆర్డీఓ అశోక్ చక్రవర్తి, ఏసీపీ రామానుజం మండలంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉన్న వెంకటపురం, కొండెగట్ల, దుద్దెపూడి, భరణిపాడు చెక్‌పోస్టులను పరిశీలించడంతోపాటు పలు గ్రామాల్లో పర్యటించి కోడ్ అమలు పరిశీలించారు. తహసీల్దార్ ఎంఏరాజు, ఎంపీడీఓ రమేష్,ఎంపీఓ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై వైరా ఏసీపీ రహమాన్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రహమాన్ మాట్లాడుతూ... ఎలాంటి పత్రాలు లేకుండా రూ.50 వేలు కంటే అదనంగా నగదును తీసుకెళ్తే స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై రాజేందర్, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.